

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### అమ్మో! వయసు...

**ఇంటిముందుకి** ఐస్క్రీమ్‌లు అమ్మొచ్చినా, బఠానీలూ, మురుకులూ, పిడతకింద పప్పు అమ్మొచ్చినా, మా బామ్మని "తింటావా?" అంటే "తింటాను" అనేది.

అదే మా అమ్మమ్మ "ముసలిదాన్ని నాకెందుక్రా?" అనేది.

చిన్నప్పటినుండీ నాకో అనుమానం మిగిలిపోయింది. పెద్దవాళ్ళకి ముసలి అయ్యామని ఎలా తెలుస్తుందీ? ఇది తినాలి. ఇవి తినకూడదు అని ఎవరు చెప్తారూ? అని.

చిన్నప్పుడు మా ప్రక్కింటివాళ్ళింట్లో తాతగారికి జంతికలూ, గవ్వలూ కలబందాలో నూరి పెట్టేవాళ్ళు మనవరాళ్ళు. అంటే తినాలనుందనేగా ఆయనకి? అంతెందుకు పనిచేసే రంగమ్మ పళ్ళూడిపోయాక కలబత్తాలో తమలపాకులూ, వక్కా, సున్నం నూరి, ఆ ముద్ద తినేది. అంటే తినడానికి పళ్ళు సహకరించవుకానీ వదులుకోడానికి మనసూ సహకరించడం లేదనేగా?

ముసలివారికి ముసలితనం వచ్చిందని ఎలా తెలుస్తుందని కదా నా ప్రశ్న. ఏ చీరయినా హుషారుగా కట్టుకుని పేరంటానికి వెళ్ళే మా అమ్మ, "చీర బరువే.. కాస్త తేలిగ్గా వుండే చీరలు కొను జరీ లేకుండా" అన్నప్పుడు తెలిసింది. రెయిలింగ్ పట్టుకోకుండా మెట్లెక్కేసే మా అత్తగారు, మేడమెట్లు రెయిలింగ్ పట్టుకుని అడుగు చూసి వేస్తూ నడవడం చూసాక తెలిసింది. అంతెందుకూ? అద్దంలో చూసుకున్నప్పుడు మెడకింద చర్మం, కాలిగోళ్ళూ చెప్తుంటాయి, మీకు వయసు పెరిగిందని.

నలభై ఐదుకే "ఈ వయసులో నాకెందుకే ఆ చీరలూ? ఆ సినిమాలూ? ఇంకా నయం. చిన్నపిల్లలమా మిరపకాయబజ్జీలూ, ఐస్క్రీమ్‌లూ తినడానికి?" అనే ముదినాపసానులనీ చూసాను. అరవై యేళ్ళు పైబడ్డా బల్లమీద కుర్చీవేసుకుని, అస్సలు తూలకుండా ఫ్యాన్లు తుడిచే మా శ్యామలమ్మనీ చూసాను.

ఇద్దరు పిల్లలు పుట్టి ఆ పిల్లలు ఏ కాలేజీలకో వెళ్ళడం మొదలెట్టగానే, పూజ రూమ్‌లలో లలితాసహస్రాలకీ, ధూపదీపాలకీ అంకితం అయిపోయి, "ఈ వయసులో భక్తి దైవం వుండాలికానీ, పిచ్చిగెంతుల సినిమాలు, ప్రేమకథలూ ఎందుకు వదినగారూ?" అనేవాళ్ళనీ చూసాను.

అరవై పైబడినా, ఎంచక్కా సాయంత్రాలు ఒక కాలు జాపి కూర్చుని బొట్టు పెట్టి దగ్గర పెట్టుకుని, చక్కగా తయ్యారయి, సిగచుట్టూ పువ్వులు ముడుచుకుని, అష్టాచెమ్మలూ, వైకుంఠపాళిలూ ఆడుతూ మనవలతో, చక్రాలూ, సఖినాలూ తినే పెద్దవాళ్ళనీ చూసాను.

"అయ్యో మనవేం చిన్నపిల్లలమా? గోవాలూ, ఊటీలూ వెళ్ళడానికి? ఏ రామేశ్వరమో, కాశీనో వెళ్ళాలి కానీ" అనే పడుచు వృద్ధులనీ చూసాను.

"నేనూ, ఆంటీ ఈ సమ్మర్‌లో క్రూజ్ ట్రిప్ ప్లాన్ చేసుకున్నాం" అనే డెబ్భైఏళ్ళ మా కల్నల్ అంకుల్‌నీ చూసాను. ఏజ్ ఈజ్ ఏ నెంబర్... దట్స్ ఆల్.. అంటుంది శోభాడే ఆవిడ నా అభిమాన రచయిత్రి. బోలెడు కబుర్లు బోల్డ్‌గా రాస్తుంది. నిజమేకదా జరిగితే జ్వరమంత సుఖం లేదని. ఇదివరకు అరవై వస్తే మంచంలో పడుకుని, కోడళ్ళని "అందులో ఉప్పు తక్కువేసావే? ఇందులో కారం ఎక్కువైందే?" అని సాధించుకుని తినేవాళ్ళు అత్తగార్లు. ఏమైనా అంటే "పెద్దదాన్నని కూడా లేదు. నన్నోమాట అడగచ్చుగా" అని సణుగుడు. అసలు ఆ ముతక చీరలు కట్టించి ప్రతిరోజూ కార్తీక మాసమనో, ఇంకోటనో స్నానాలూ, జపాలూ చేయించి, ఆ చలికి చర్మం ముడుచుకుపోయేట్లు చేసి, పగిలనకాళ్ళు, విరిగిన గోళ్ళతో కళ్ళకింద నల్లచారలొచ్చి, ఉపవాసాలు అంటూ కడుపు మాడ్చుకుని లేని పెద్దరికాలని మీద వేసుకోవడం వల్ల అరవయికే ముసలివయసు అనుకునేవారేమో ఆ రోజుల్లో? లేదా పన్నెండేళ్ళకో, పద్దెనిందికో పెళ్ళి చేస్తే ఏటా బాలింతా, చూలింతగా ఓ ఎనమండుగురిని కని, బోలెడు రక్తహీనతతో, పాలిపోయి, సడిలిపోయి వృద్ధాప్యం వచ్చేసిందనుకునేవారేమో పాపం. ఇప్పుడు అరవై అంటే వృద్ధాప్యానికి బాల్యం. జుట్టుకి రంగూ, ఫిజికల్ ఫిట్‌నెస్ పట్ల అవగాహనా, ఆహారంలో మార్పులతో ఎవరికీ అరవై వచ్చినా తెలియదు. షష్టిపూర్తులు కూడా అందుకే 'గప్‌చుప్'గా చేసేసుకుంటున్నారు. మన హీరోలు అరవై వచ్చినప్పుడు కూడా "చిలకకొట్టుడు కొడితే.. చిన్నదానా?" అనో, "తహ తహ తహ... తహ తహలో... "ొజోరుమీద మోగుతోంది జోడు సన్నాయి మేళం.. అందమైన అనుభవాలకీ ఇదే ఆదికావ్యం" అంటూ జయప్రదా, శ్రీదేవీలాంటి అప్పటి కుర్రపిల్లలతో గెంతడం చూసి, ఇప్పుడూ "అమ్మడూ .. లెట్ అజ్ స్టార్ట్ కుమ్ముడూ" అంటున్న హీరోలని చూసి 'ముసలితనం' అన్న మాటని పక్కకి తోసెయ్యాలి.

నేను మొదటిసారి వంగూరి సదస్సుకి అమెరికా వెళ్ళినప్పుడు, వింజమూరి సిస్టర్స్ సీతా అనసూయగార్లని కలిసాను. అప్పటికే ఎనభై వున్న ఆవిడ "లిప్‌స్టిక్ వుందా?" అని అడిగారు రెస్ట్‌రూములో.. నేను లేదన్నాను "అదేవిటే కుర్రపిల్లలూ.. మేకప్ దగ్గర పెట్టుకోవద్దా? అసలు నా తలకట్టు ఎలా వుండేదనుకున్నావ్? ఒకసారి కత్తిరించిన నా తలవెంట్రుకలు సువెనీర్‌గా కావాలన్నాడు ఒక ఫ్రెండ్" అని నవ్విందావిడ. అదీ యవ్వనం అంటే. అదీ ఉత్సాహం అంటే.

శరీరం ఒక వయసు తర్వాత కొన్ని మెసేజ్‌లూ, వార్నింగులూ, అత్యవసరం అయితే టెలిగ్రామ్‌లూ పంపుతుంది కానీ మనసుకి వార్ధక్యం అంత త్వరగా రానీయకూడదు. జీవించడానికీ, బ్రతకడానికీ తేడా తెలీక చాలామంది "ఓ పూట అన్నం రెండోపూట ఇంత పలహారం మధ్యలో నిద్రా" అనుకుంటారు. కొంతమంది, డెబ్భై పై బడినా వెల్లివిరిసే ఉత్సాహంతో, ఘల్లున నవ్వుతూ చుట్టుపక్కల వాళ్ళని నవ్విస్తూ, ఏదో ఒక పనిచేస్తూ, చుట్టూ జనాన్ని పెట్టుకుని, ఛలో పాలోమని వుంటారు. మా అమ్మని అందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

అమ్మ పడినన్ని కష్టాలు ఆ రోజుల్లో తక్కువమంది పడుంటారు. శారీరకంగా చాలా బలహీనమైన మనిషి. కానీ ఆవిడకి ఉద్యోగంలో రిటైరయ్యేముందు జీవితాన్ని ఎలా అనుభవించాలో ఆనందాన్ని ఇతరులకి ఎలా పంచాలో తెలిసింది. ప్రతిరోజూ దిల్‌సుఖ్‌నగర్‌లో ప్రొద్దుటే నాలుగింటికి డబ్బా కట్టుకుని, డిపోలో బస్సెక్కి నల్గొండవెళ్ళి ఆర్.టీ.సీ డిపోలో హెడ్‌క్లర్క్‌గా ఉద్యోగం చేసి, సాయంత్రం హైదరాబాద్‌లో ఇంటికొచ్చేది. రిటైర్ అయ్యాక ఆవిడకి సత్సంగం. షిరిడీ వెళ్ళి ఒక్కతే రెండుమూడు నెలలు ఉండటం అలవాటు చేసుకుంది. అక్కడ సెక్యూరిటీ గార్డ్స్ నుండీ, ఊరివాళ్ళందరూ కూడా "మాజీ.. బహుత్ అచ్చాసే బాత్ కర్తీ హై" అని అమ్మ మాటలు విని నవ్వడానికొస్తారు. అమ్మ చెప్పేటన్ని జోక్స్ నేనుకూడా చెప్పలేను. శారీరక అనారోగ్యాలని మానసిక బలం జయించింది. అందుకే చుట్టూ ఉండే మనుషులనీ కంపెనీనీ ఆరోగ్యదాయకంగా చూసుకోవాలి. చాదస్తులూ, మూఢనమ్మకాలని ప్రేరేపించే వారిని దూరం పెట్టాలి.

ఇక్కడో దురదృష్టకరమైన విషయాన్ని ప్రస్తావిస్తున్నాను. నా స్నేహితురాలి తల్లికి ముగ్గురు మగ పిల్లలూ, ఐదుగురు ఆడపిల్లలూ. ఆవిడ భర్త ఘనాపాటి. ఆవిడ కాశీ అన్నపూర్ణలా మొహాన కాసంత బొట్టుపెట్టుకుని, కాళ్ళకి పసుపుతో, మడిచీరతో కనిపించేవారు. వేద పండితులు ఎవరొచ్చినా వాళ్ళింట్లోనే మడి సాగుతుందని భోజనం చేసేవాళ్ళు. మనవలనీ, మునిమనవలనీ చూసుకున్నాక, ఆవిడ భర్త పరమపదం చేరుకున్నారు. బిడ్డలంతా తండ్రిపోయినందుకు కన్నా, తల్లిని పసుపుకుంకుమలు లేకుండా ఎలా చూస్తాం అని విలపించారు. ఇంతవరకూ బానే వుంది. పెద్దకూతురు మిగతా పిల్లల్ని చుట్టూ కూర్చోపెట్టుకుని "అమ్మని మనం ఎలా చూసాం చెప్పండి? ఇప్పుడిలా చూడగలమా? పసుపూ, కుంకుమ లేకుండా? మనం అంతా దేవుణ్ని ప్రార్థిద్దాం. అమ్మని పదోనాటికల్లా తీసుకుపొమ్మని గట్టిగా ప్రార్థించండి" అని చెప్పడం మొదలు పెట్టింది.

చెడుకి ఆకర్షణ ఎక్కువ. ఆర్.ఎస్.ఎస్.కి వెళ్ళి కఠినంగా వుండే మా ఫ్రెండ్ కూడా అక్కమాటలకి బలహీనపడి, ఒకటి రెండుసార్లు "మా అమ్మని తీసుకుపో.. భగవాన్" అని ప్రార్థించిందంట కూడా. ఆరోగ్యగా వున్న ఆ డెబ్భైఏళ్ళ స్త్రీ చేసిన తప్పేవిటి? పసుపుకుంకుమలు లేకుండా ఆవిడ్ని వీళ్ళు చూడలేకపోవడం ఆవిడ తప్పా?

ఇలా జరుగుతుండగా ఒకనాడు నా ఫ్రెండ్ తల్లి పక్కన కూర్చునుండగా వాళ్ళ పెద్దక్క వచ్చిందంట. నా స్నేహితురాలు లేవబోతుంటే, తల్లి ఆమె చెయ్యి గట్టిగా పట్టుకుని "వెళ్ళకు నువ్వెళ్తే అది నన్ను చచ్చిపోమంటుంది" అని ఏడ్చిందంట. ఈమె అవాక్కయిందంట. తల్లి అక్కగారు కనుమరుగవగానే "దీని మాటలు విని, ఏ మేడమీదనుండో దూకేస్తే ఏ కాలో చెయ్యో విరిగి బతికితే ఎవరు చూస్తారే? " అని ఏడుస్తుంటే, అప్పుడు దానికి స్పృహ వచ్చి, తనుకూడా అలా ఆలోచించినందుకు సిగ్గుపడి తనని తను అసహ్యించుకుని, "అమ్మా ఈసారి అది ఆ మాటంటే ఈడ్చి చెంపమీద కొట్టు" అని జవాబిచ్చిందంట.

అంతేకాదు, పదోనాడు సుమంగళులు బియ్యం నోట్లో వేసుకుని చూడాలంటే "ఏం కాదు అని ఆవిడ్ని మొదట తనే స్నానం చేయించి కౌగిలించుకుని తీసుకొచ్చి, ఘనాపాఠి అయిన తండ్రి స్నేహితుడిని పిలిపించింది ఆయన "ఇదంతా కర్మానుసారిణి" అని చెప్పి ఆవిడ్ని అడిగి ఆవిడ చేతి మంచినీళ్ళు తాగి "అమ్మా నువ్వు భాగీరథిలాంటి పవిత్రురాలివి. నిన్ను చూస్తే పుణ్యం" అని చెప్పారట.

ఈ యాభై ఆరేళ్ళ ముదినాపసాని అక్కగారు, ఇప్పటికీ మా ఫ్రెండ్‌తో ఈ పని చేయించినందుకుగాను మాట్లాడదుట. ఇదంతా ఎందుకు చెప్పానంటే వయసొస్తే బుద్ధిరావాలి. చాదస్తం, మూర్ఖత్వం రాకూడదు. ఓ వయసురాగానే "ఇలాగైతేనే తింటాం. ఇలాగైతేనే ఉంటాం" అని కరాఖండీగా రిజిడ్‌గా తయ్యారయ్యే రైట్స్ వయసు ఇవ్వదు.

అసలు ఉత్సాహంగా ఉన్నవాళ్ళని వయసు బెదరగొట్టలేదు. అసలు దగ్గరకే రాదు. కాయకష్టం చేసుకునే స్త్రీలని చూసారా. సందానీ అత్త ఎనభై ఏళ్ళు వచ్చేదాకా "పల్లీకాయలేర బోతున్నా" అంటూ పొలానికెళ్ళేది. సందానీ తల్లి అరవై పైబడినా బీడీలు చేసేది, తన ఇంటికి 'తాపీ' పని తనే చేసుకునేది.

మా అమ్మమ్మగారు డెబ్భై వచ్చేదాకా కూడా ఏ మనవడికైనా, మనవరాలికైనా కొత్తగా ఉద్యోగం వచ్చి వేరే ఊరు వెళ్ళాల్సి వస్తే వెళ్ళి వండిపెట్టేది. సుఖానికీ దుఃఖానికీ ఆవిడ తోడుండేది. ఒంట్లో బాలేకపోతే సరే. బావున్నంతవరకూ వయసు అయిపోతుందని అనుకోకూడదు.

మా బామ్మకి ఎనభై వచ్చాక ఓసారి ఆవిడ చిన్ననాటి స్నేహితుడొచ్చాడు. ఇద్దరూ చిన్నపిల్లల్లా చాలాసేపు కబుర్లాడుకున్నాక, ఆయన వెళ్ళడానికి లేవబోతుంటే ఈవిడ "చెయ్యి అందించనా?" అంది. ఈవిడేం ఆయన కన్నా చిన్నపిల్లేం కాదు. మేం చాటునుండి చూసి నవ్వాం. మాలో ఒక రాలుగాయి "ఈయన్ని పెళ్ళిచేసుకున్నా నువ్వు, మాకు ఇప్పటికీ తాతగారుండేవారు బామ్మా" అంది.

"ఛీ పోవే" అని ఆవిడ చెంపలు రాగరంజితం అయ్యేట్లు సిగ్గుపడింది ఎనభైఏళ్ళ వయసులో.

జుట్టుకి రంగేసి ప్రపంచాన్ని మోసం చెయ్యడం కాదు. మనని మనం నమ్మించుకోడం కోసం. అలాగే నడక స్లోగా మారితే 'చెప్పుల తప్పు', కళ్ళు మసకేస్తే 'కళ్ళల్లో లెన్స్‌లు పెట్టుకోవాలి' అని మనకి మనం చెప్పుకుంటాం. కానీ మనసులో ఆనందం తక్కువైతే మాత్రం ఓ పదేళ్ళు అమాంతం వచ్చి మీదపడి కబళించేస్తుంది జాగ్రత్త.

ఆనందం.... మీ డిక్షనరీలో ఏవిటో మీరే రాసుకోవాలి. మీ వాళ్ళతో సంతోషంగా వుండడమా? మనసుకి నచ్చిన పని చెయ్యడమా? ఇతరులకి ఉపయోగపడడమా? కానీ చివరిగా ఓ మాట. 'ప్రేమించాలి' ప్రేమ.. నిత్యయవ్వనంగా ఉంచుతుంది. ఇది సత్యం.




Post your comments

https://www.youtube.com/watch?v=ERaaX_IulS4

